

ఎస్‌డీపీవో బదిలీ

పార్వతీపురం, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం పార్వతీపురంలో ఎస్‌డీపీవోగా పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి సునీల్ సిరోన్‌కు బదిలీ అయ్యింది. గ్రూప్ కమాండర్‌గా ఆయనకు స్థానచలనం కల్పిస్తూ.. శుక్రవారం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆ స్థానంలో గ్రేహౌండ్స్‌లో అసిస్టెంట్ కమాండర్‌గా పనిచేస్తున్న సురాణ అంకిత మహావీర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. 2021 ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన పార్వతీపురం ఎస్‌డీపీవోగా త్వరలో బాధ్యతలు చేపట్టనున్నారని సంబంధిత అధికార వర్గాలు తెలిపాయి.

వరలక్ష్మీ నమోస్తుతే..

● భక్తిశ్రద్ధలతో వ్రతాలు, పూజలు ● అమ్మవారి ఆలయాలు కిటకిట ● వెల్లివిరిసిన శ్రావణ శోభ



పార్వతీపురం కన్యకాపరమేశ్వరీ ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న మహిళలు

పార్వతీపురం టౌన్/ పాలకొండ: జిల్లా వాసులు శ్రావణ రెండో శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే అమ్మవారి ఆలయాలకు చేరుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని పులకించిపోయారు. మరోవైపు మహిళలు ఇళ్ల వద్ద వరలక్ష్మీ వ్రతాలను ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఇష్టమైన ఆహార పదార్థాలు, పిండి వంటలను వండి నైవేద్యంగా సమర్పించారు. ఆ తర్వాత ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు చేశారు. పాలకొండ పట్టణంలో కోటదుర్గమ్మ, గాయత్రీదేవి ఆలయాల్లో వరలక్ష్మీ వ్రతాలు చేశారు. కోటదుర్గమ్మ ఆలయంలో సుమారు 1500 మంది మహిళలు కుంకుమపూజలు చేపట్టారు. పార్వతీపురంలోని పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. పార్వతీదేవి, కన్యాకాపరమేశ్వరీ ఆలయాల్లో కుంకుమార్చనలు, అభిషేకాలు చేశారు. మొత్తంగా అంతటా శ్రావణ శోభ వెల్లివిరిసింది.





కోటదుర్గమ్మ ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహిస్తున్న మహిళలు (ఇన్‌సెట్లో) ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గెడ్డ మింగేసింది

● కొండవాగులో ఇద్దరు ఏకలవ్య ఉద్యోగుల గల్లంతు ● ద్విచక్రవాహనంతో దాటుతుండగా ఘటన

● టీచర్ మృతదేహం లభ్యం.. వార్డెన్ కోసం గాలింపు ● ఇద్దరిదీ హర్యానా రాష్ట్రం

● విధుల్లో చేరి రెండు నెలలైనా కాని వైనం



ఇసుకలో కూరుకుపోయిన ద్విచక్రవాహనం



ఆర్తి (ఫైల్)



మహేష్ (ఫైల్)

పార్వతీపురం, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి) /పాచిపెంట/ సాలూరు: ఎన్నో ఆశలతో ఉద్యోగంలో చేరారు.. చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారు. సుదూర ప్రాంతం నుంచి వచ్చిన వారు అందరితో కలిసిపోయారు. ఈ ప్రాంతంలో కుదురుకున్నారు. అయితే అంతా బాగుందనుకుంటున్న సమయంలో విధి వారిపై చిన్నచూపు చూసింది. విధుల్లో చేరి 45 రోజులు గడవకముందే.. ఆ ఉద్యోగులను కొండవాగు గెడ్డ మింగేసింది. వారిలో ఒకరు మృతి చెందగా.. మరొకరి కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే..

పాచిపెంట మండలం సరాయివలస (కోటికిపెంట) ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో సోషల్ టీచర్ కమ్ వార్డెన్‌గా మహేష్ (27), జాగ్రఫీ ఉపాధ్యాయురాలిగా ఆర్తి (23) పనిచేస్తున్నారు. వీరు హర్యానా రాష్ట్రానికి చెందిన వారు. జూన్ 20న వారు విధుల్లో చేరారు. వారికి ఇంకా వివాహాలు కాలేదు. సాలూరు పట్టణంలోని అద్దె ఇళ్లలో వేర్వేరుగా నివసిస్తున్నారు. రోజూలానే శుక్రవారం విధులు ముగించుకుని బైక్‌పై వారు పాఠశాల నుంచి సాలూరు బయల్దేరారు. మార్గమధ్యంలో సరాయివలస సమీపంలో ఉన్న కొండవాగు గెడ్డ ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో కొద్దిసేపు అక్కడ నిరీక్షించారు. అనంతరం ఓ బైక్ వాగు దాటి వెళ్లగా.. వీరు కూడా ప్రయత్నించారు. అయితే వాగు దాటుతుండగా.. వరద ఉధృతికి బైక్‌తో సహా వారు గల్లంతయ్యారు. ఈ విషయాన్ని తెలుసుకున్న గురివినాయుడుపేటకు చెందిన టీడీపీ నాయకుడు కొరిపిల్లి సురేష్ మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి ఫోన్‌లో సమాచారం అందజేశారు. వెంటనే కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌తో పాటు ఇతర అధికారులను ఆమె అప్రమత్తం చేశారు. గాలింపు చర్యలు చేపట్టి వారిని రక్షించాలని ఆదేశించారు. దీంతో పాచిపెంట ఎస్ఐ నారాయణరావు, తహసీల్దార్ డి.రవి తమ సిబ్బందితో కలిసి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాలింపు చర్యలు ముమ్మురం చేశారు. అయితే ఘటనా స్థలానికి కొద్ది దూరంలో (ఆరు రోడ్ల కూడలి) జాగ్రఫీ టీచర్ ఆర్తి మృతదేహం లభ్యమైంది. వార్డెన్ మహేష్ ప్రమాదం నుంచి బయటపడినట్టే బయటపడి మళ్లీ వాగులోకి కొట్టుకుపోయారు. దీంతో ఆయన ఆచూకీ కోసం విస్తృతంగా గాలిస్తున్నారు. ఈ ఘటనపై కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. భవిష్యత్‌లో ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా చూడాలని జిల్లా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అధికారి శాంతీశ్వరరావును ఆదేశించారు.

ఇటీవల కేంద్రప్రభుత్వం వారిని టీచర్లుగా నియమించింది. హర్యానాకు చెందిన ఏకలవ్య ఉద్యోగులకు కొండవాగులు, గెడ్డల పైన అవగాహన లేకపోవడం, తెలుగు భాష తెలియకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు. కాగా కొండవాగు గెడ్డ వరద కొంచెం దూరంలో ఉన్న ప్రధాన నది వట్టిగెడ్డలో కలుస్తుంది.

ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని...

ఏకలవ్య పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది వర్షాకాలంలో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రాకపోకలు సాగించాల్సి వస్తోంది. రోజూ వాగును దాటుకొని విధులకు వెళ్లాల్సి ఉండడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. సరాయివలస, కొటికిపెంట తదితర ప్రాంతాల్లో గిరిజనులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు వంతెన నిర్మాణంపై దృష్టి సారించలేదు. ఈ నేపథ్యంలో ఆ ప్రాంతవాసుల, ఉద్యోగులు నూతన ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు. యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోకుంటే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

పర్యాటకాభివృద్ధికి చర్యలు

● అధికారులను ఆదేశించిన కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



పార్వతీపురం, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పర్యాటకాభి వృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. 2047 నాటికి ఎకానమికల్ మాస్టార్ ప్లానింగ్ ఫర్ డెవలపింగ్ విశాఖ సిటీ రీజియన్ గ్రోత్ హబ్ అంశంపై శుక్రవారం నీతి అయోగ్ అధికారులు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో ఆర్థికాభివృద్ధికి అవకాశా లున్న రంగాలను గుర్తించాలని, నూతన పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు దిశగా అన్ని చర్యలు చేపట్టాలని వారు సూచించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలో పెద్దఎత్తున పర్యాటక పనులు చేపట్టడానికి అవకాశాలు ఉన్నాయన్నారు. వారం రోజుల్లో జిల్లాలో ఉన్న అన్ని అవకాశాలపై ప్రత్యేక నివేదిక తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. జిల్లాలో ప్రకృతి వనరులు, ఔషధ విలువలున్న మూలికలు ఎన్నో ఉన్నాయని, వాటి ద్వారా పర్యాటకులను ఆకర్షించడం ద్వారా ఈ ప్రాంతం ప్రకృతి వైద్య సూచనలకు హబ్‌గా మారుతుందని చెప్పారు. భోగాపురం ఎయిర్‌పోర్టు అందుబాటులోకి వస్తే.. జిల్లాకు సులభంగా రావొచ్చని కలెక్టర్ అన్నారు. తోటపల్లి, పెద్దగెడ్డవంటి రిజర్వాయర్లలో వాటర్ స్పోర్ట్స్ పెట్టడానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని సూచించారు. సీతంపేట ఎన్టీఆర్ అడ్వంచర్ పార్క్‌కు అదనపు సౌకర్యాలు కల్పించాలని, గిరిజన మ్యూజియం ప్రారంభోత్సవానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సెప్టెంబరు 27న ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా జిల్లాలో పెద్ద ఎత్తున కార్య క్రమాలు చేపట్టాలని పర్యాటక అధికారి ఎన్.నారాయణరావును ఆదేశించారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ కె.రామచంద్రరావు, జిల్లా వ్యవసాయ, పరిశ్రమలు, ప్రణాళికా అధిఆరులు కె.రాబర్ట్‌పాల్, కరుణాకర్, పి.వీరరాజు పాల్గొన్నారు.

డీఎస్సీ శిక్షణకు ప్రవేశ పరీక్ష

మెగా డీఎస్సీకి సిద్ధమవుతున్న గిరిజన అభ్యరులకు పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల ద్వారా ప్రవేశపరీక్ష నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. ఆదివారం జిల్లా కేంద్రంలో 219 మందికి ప్రవేశ పరీక్ష జరుగుతుందని, ఎంపికైన అభ్యర్థులకు ప్రత్యేక శిక్షణ అందిస్తామని తెలిపారు. సీతంపేటలో శిక్షణతో పాటు వసతి సదుపాయం కల్పిస్తామన్నారు.

వరదనీరు మళ్లించండి

● సిబ్బందికి నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ సుగుణాకరరావు ఆదేశం



హెడ్ రెగ్యులరేటర్‌ను సందర్శించేందుకు వెళ్తున్న ఇంజనీరింగ్ అధికారులు

భామిని: వంశధారలో వరదనీటిని కాలువ ద్వారా మళ్లించేందుకు చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ చీఫ్ ఇంజనీర్ సుగుణాకరరావు సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం వరదకాలువ ముఖ ద్వారమైన కాట్రగడ వద్ద ప్రాంతాన్ని పరిశీలించారు. పెండింగ్ పనులను అడిగి తెలుసుకున్నారు. కాట్రగడ-బీ నుంచి సింగిడి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు సిమెంట్ పనులపై ఆరా తీశారు. ఓపెన్ హెడ్ చానల్ సైడ్ వియ్యర్ మధ్యలో సిమెంట్ బేస్‌మెంట్ వద్ద ఇసుకను తొలగించి వరదనీటిని మళ్లించాలని సూచించారు. అనంతరం వరదకాలువ హెడ్ రెగ్యులేటర్‌ను సందర్శించారు. వంశధార నదిలో స్వల్పంగా పెరగడంతో.. ఆయన ఆదేశాల మేరకు ఐదు గేట్లు ఎత్తి వెయ్యి క్యూసెక్కులను మళ్లించారు. ఎస్ఈ రాంబాబు , ఈఈ రామచంద్రరావు, డీఈ భవానీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వెస్ట్‌బెంగాల్ ఘటనపై వైద్యుల నిరసన

● పట్టణంలో ర్యాలీ ● రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు వినతి

పార్వతీపురం, ఆగస్టు16 (ఆంధ్రజ్యోతి): వెస్ట్ బెంగాల్‌లోని ఓ వైద్యురాలిపై జరిగిన అత్యాచారం ఘటనను నిరసిస్తూ జిల్లా కేంద్రంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, వైద్య సిబ్బంది, ఏపీ ఎన్జీవో సంఘం నాయకులు శుక్రవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆర్టీసీ కూడలి నుంచి కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ శ్యామ్ ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైద్యుల సంఘం నాయకుడు డా.వినోద్ మాట్లాడుతూ.. ఇటువంటి ఘటనలను దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వైద్యులకు, వైద్య సిబ్బందికి రక్షణ కావాలని డిమాండ్ చేశారు. పశ్చిమబెంగాల్ సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసనలో వైద్యులు వాసుదేవరావు, భోగి ఈశ్వరరావు, కామేశ్వరి, రవికుమార్, శేషగిరిరావు, ఏపీ ఎన్జీవో సంఘం నాయకుడు జీవీఆర్ఎస్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైద్యులు, ఎన్జీవో సంఘాల నాయకులు

గిరిజనులకు పథకాలు చేరువ చేస్తాం

● సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో రమణ



వైటీసీలో గర్భిణుల వసతిగృహాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జి పీవో

సీతంపేట: సీతంపేట ఐటీడీఏ ఇన్‌చార్జి పీవోగా పాలకొండ ఆర్డీవో వీవీ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలు గిరిజనులకు చేరువయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. గిరిజనుల అభివృద్ధికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. అనంతరం వైటీసీలో ఏర్పాటు చేస్తున్న గర్భిణుల వసతిగృహాన్ని పరిశీలించారు. గిరిజన గర్భిణులకు అనుకూ లమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్‌శాఖ అధికారులకు సూచించారు. ఉచిత డీఎస్సీ కోచింగ్ ప్రవేశ పరీక్షకు ఏర్పాట్లు చేయాలన్నారు. అభ్యర్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో ఏపీవో చినబాబు, డిప్యూటీ డీఈవో పి.నారాయుడు, ఏఎంవో కోటిబాబు, సీఎంవో చిరంజీ వులు, ఏఈ మోహన్‌గోపాల్, వైటీసీ ఇన్‌చార్జి మేనేజర్ రమణ తదితరులున్నారు.

వానొస్తే.. ఇంతే..



పార్వతీపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో నిలిచిన వర్షపునీరు

పార్వతీపురం టౌన్, ఆగస్టు 16 : పార్వతీపురంలో గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం ముంపునకు గురైంది. మైదానంలో నీరు నిలిచిపోవడంతో ఆ ప్రాంతం చెరువును తలపించింది. దీంతో క్రీడాకారులు, విద్యార్థులు, వాకర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. జిల్లా కేంద్రంలో ఉన్న ఏకైక క్రీడా మైదానం అభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కేజీబీవీలోకి వరద..

భారీ వర్షాల కారణంగా పట్టణంలోని కేజీబీవీ ఆవరణ చుట్టూ వరదనీరు చేరింది. నీరు బయటకు వెళ్లే మార్గం లేకపోగా, మరోవైపు విద్యుత్ సరఫరా కూడా నిలిచిపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వరద నీటి కారణంగా విద్యార్థినులకు ఏమైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పండు, రాజులు ప్రశ్నించారు. వరదనీటిలో చిక్కుకున్న కేజీబీవీ విద్యార్థినులకు రక్షణ కల్పించాలని శుక్రవారం ఆ ప్రాంతంలో నిరసన వ్యక్తం చేశారు.



వరదనీటిలోనే ఉన్న కేజీబీవీ విద్యార్థినులతో నిరసన వ్యక్తం చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ఆంధ్రజ్యోతి

నవ్య | చిత్రజ్యోతి

శనివారం ● 17 ఆగస్టు 2024

cinema@andhrajyothy.com



శ్రీకృష్ణుడే అవార్డుని తెచ్చాడు

కార్తికేయ 2 చిత్రానికి జాతీయ పురస్కారం దక్కడం పీపుల్ మీడియా ఫ్యాక్టరీ సంస్థకు గొప్ప విజయం అని ఆ చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. నిఖిల్ సిద్ధార్థ్ హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో టీజీ విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా పురస్కారం గెలుచుకున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించింది. టీజీ విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తికేయ 2' మొదలు పెట్టినప్పుడే పెద్ద సినిమా అనుకున్నాం. ఇంత సక్సెస్‌ను ఊహించలేదు. జాతీయ పురస్కారం దక్కడం మా సంస్థకు చాలా గొప్ప విషయం' అన్నారు. ఈ అవార్డునే శ్రీకృష్ణుడే తీసుకొచ్చాడని భావిస్తున్నాను అని అభి షేక్ అగర్వాల్ చెప్పారు. నేషనల్ అవార్డ్ మాపై బాధ్యతను మరింత పెంచింది అని చందు మొండేటి తెలిపారు. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా తను తీస్తున్న 'తండేల్' పూర్తయ్యాక 'కార్తికేయ 3' ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. తను హీరోగా నటించిన 'కార్తికేయ 2' జాతీయ స్థాయిలో సత్తా చాటడం ఆనందంగా ఉందని హీరో నిఖిల్ చెప్పారు.

విజేతలకు ప్రముఖుల అభినందనలు

జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు నుంచి కార్తికేయ - 2 అవార్డు పొందటం సంతోషకరం. ఉత్తమ నటి నిత్యమీనన్, ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ నృత్య దర్శకుడిగా ఎంపికైన జానీ మాస్టర్‌కు హృదయపూర్వక అభినందనలు.

- పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి

70వ జాతీయ చలనచిత్ర పురస్కార విజేతలకు అభినందనలు. ఉత్తమ నటుడు రిషబ్‌శెట్టి, ఉత్తమ నటి నిత్యామేనన్.. ఉత్తమ చిత్రం 'ఆట్టమ్' , కార్తికేయ 2' మేకర్స్‌కు అలాగే ఇతర పురస్కార గ్రహీతలందరికీ అభినందనలు

- చిరంజీవి

రిషబ్‌శెట్టికి అభినందనలు. 'కాంతార' చిత్రానికి ఉత్తమ నటుడి పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉంది. అందుకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్న వ్యక్తివి. 'కాంతార' చిత్రంలో నీ అభినయం గుర్తుకు వస్తే ఇప్పటికీ నాకు గూస్ బంప్స్ వస్తున్నాయి.

- ఎన్టీఆర్

జాతీయ చలనచిత్ర అవార్డుల్లో.. దుమ్మురేపిన సౌత్ సినిమా

జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం శుక్రవారం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్'ను వరించగా, ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకు గాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ వినోదాత్మక చిత్రంగా సైతం 'కాంతార' నిలిచింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్(తిరుచిత్రం బళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్-2 అవార్డు దక్కించుకుంది. ఉత్తమ హిందీ చిత్రంగా 'గులెహార్' నిలిచింది. 'పొన్నియిన్ సెల్వన్-1' చిత్రానికి నాలుగు పురస్కారాలు దక్కాయి. మలయాళ, తమిళ చిత్రాలకు ఐదు చొప్పున అవార్డులు ప్రకటించగా, కన్నడ సినిమాకు మూడు పురస్కారాలు వచ్చాయి. తెలుగుకు దక్కింది ఉత్తమ ప్రాంతీయ చిత్రం ఒక్కటే! 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగాను ఈ అవార్డులను కేంద్రం ప్రకటించింది. 2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను ప్రకటించింది.

న్యూఢిల్లీ, (ఆంధ్రజ్యోతి)

నాలుగోసారి దక్షిణాది హీరోలదే హవా

తాజాగా రిషబ్ శెట్టిని జాతీయ ఉత్తమ నటుడి పురస్కారం వరించడంతో దక్షిణాది చిత్రపరిశ్రమ అరుదైన ఘనతను సాధించినట్లైంది. వరుసగా నాలుగుసార్లు దక్షిణాది హీరోలు జాతీయ ఉత్తమ నటుడి పురస్కారాన్ని దక్కించుకున్నారు. 2019లో ధనుష్‌కు మనోజ్ బాజ్‌పాయ్‌తో కలసి ఉత్తమ నటుడి పురస్కారం దక్కింది. 'అసురన్' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపిక య్యారు. 2020లోనూ సూర్య, అజయ్ దేవ్‌గణ్ ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 'సూరారై పొట్రు' (తెలుగులో 'ఆకాశం నీ హద్దురా') చిత్రానికి గాను సూర్య ఉత్తమ నటుడి పురస్కారానికి ఎంపికయ్యారు. 2021లో 'పుష్ప' చిత్రానికి గాను అల్లు అర్జున్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఇప్పుడు 2022కి గాను రిషభ్‌శెట్టిని ఈ పురస్కారం వరించింది. అంతకు ముందు 2010లో కూడా 'ఆడుకాలం' చిత్రానికి గాను ధనుష్ ఉత్తమ నటుడిగా ఎంపికయ్యారు. ఈసారి కూడా ఉత్తమ నటుడి పురస్కారానికి దక్షిణాది నుంచి మమ్ముట్టి, రిషబ్ శెట్టి, బాలీవుడ్ నుంచి విక్రాంత్ మాసే (ట్వల్త్ ఫెయిల్) పోటీ పడగా అదృష్టం రిషబ్‌ను వరించింది. మమ్ముట్టి 'నాన్పకల్ నేరట్టు మయక్కం, రోషాక్' రెండు చిత్రాలతో బరిలో నిలిచినా ఫలితం నిరాశపరిచింది.







తెలుగు సినిమాకు అన్యాయం జరిగిందా?





జాతీయ చలనచిత్ర అవార్డులు శుక్రవారం ప్రకటించారు. గత ఏడాది తెలుగు సినిమాకు ఉత్తమ జాతీయ నటుడు అవార్డు సహా తొమ్మిది అవార్డులు రావడంతో కాలరు ఎగరేసిన తెలుగు ప్రేక్షకుడు ఈసారి ప్రకటించిన అవార్డుల్లో తెలుగు సినిమాకు ఒక్కటంటే ఒక్క అవార్డ్ కూడా లేకపోవడం చూసి ఆశ్చర్యపోయాడు. ఇలా ఎందుకు జరిగిందని ఆలోచనలో పడ్డాడు.

తెలుగు రాష్ట్రాలు విడిపోయిన తర్వాత సినిమాలకు ప్రభుత్వ అవార్డులు అన్నవి లేనేలేవు. ఇప్పుడైనా ఇస్తారో, ఇవ్వరో తెలియని పరిస్థితి. ఫిల్మ్ ఫేర్ వంటి ప్రైవేట్ అవార్డులను పక్కన పెడితే, సినిమా ప్రముఖులు ఆశించేది, రావాలని కోరుకునేది జాతీయ చలనచిత్ర అవార్డులే. జాతీయ అవార్డ్ పొందితే కెరీర్ పరంగా ఏదో సాధించామనే సంతృప్తి చాలా మందికి ఉంటుంది. అయితే జాతీయ అవార్డు అందుకునే స్థాయి కలిగిన చిత్రాలు తెలుగులో ఎన్ని వస్తున్నాయనేది ఒక ప్రశ్న. తెలుగు చిత్ర పరిశ్రమలో టాలెంట్‌కు కొదువ లేదు. సినీ ప్రపంచమంతా తెలుగు చిత్రపరిశ్రమ వైపే చూస్తున్న రోజులివి. కొత్త తరహాగా ఆలోచించడం, కష్టపడే తత్వం తెలుగు వారికి ఎక్కువ. అయినా సరే కొత్త తరహా చిత్రాల గురించి ఆలోచించకుండా కమర్షియల్ చిత్రాలపై మోజుతో నిర్మాతలు పరుగులు తీస్తున్నారన్నది ఎవరూ కాదనలేని సత్యం. కాకపోతే ఈ ఏడాది ఢిల్లీకి పంపిన చిత్రాల్లో అవార్డుకు అర్హమైనవి కొన్ని ఉండడం వాటికి ఒక్క అవార్డ్ కూడా రాకపోవడం చర్చనీయాంశం అయింది.

కరోనా కారణంగా..

శుక్రవారం ప్రకటించిన నేషనల్ అవార్డ్స్ 2022 సంవత్సరం లో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాలకు సంబంధించినవి. వాస్తవానికి 2023 మే 3న ఈ అవార్డులను ప్రదానం చేయాలి. అయితే కరోనా తర్వాత జాతీయ చలన చిత్ర అవార్డుల షెడ్యూల్‌లో మార్పులు జరిగియి. అవార్డుల ఎంపిక, ప్రదాన కార్యక్రమం ఆలస్యమవుతూ వస్తున్నాయి. లోకసభకు జరిగిన ఎన్నికల కారణంగా జాతీయ అవార్డులు ఈసారి మరింత ఆలస్యమయ్యాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడానికి ముందే అవార్డుల ఎంపిక ప్రక్రియ మొదలైనా ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో దానిని మధ్యలోనే ఆపేసి ఎన్నికల ఫలితాలు వెల్లడి అయ్యాక మళ్లీ మొదలుపెట్టారు. ఇప్పుడు ప్రకటించిన అవార్డులను అక్టోబరు నెలలో విజేతలకు అందజేస్తారని సమాచారం.

ఇరవై సినిమాలు... ఒకే ఒక్క అవార్డ్

జాతీయ అవార్డుల కోసం తెలుగు నిర్మాతలు ఈసారి పెద్ద సంఖ్యంలోనే ఎంట్రీలు పంపారు. ఆ జాబితాలో ఉన్న సినిమాలు ఏమిటంటే 1. రైటర్ పద్మభూషణ్, 2. సీతారామం 3. అంటే సుందరానికి.. 4. విరాటపర్వం 5. యశోద 6. రాధేశ్యామ్ 7. సర్కారు వారి పాట 8. మర్రి చెట్టు 9. కుదిరామ్ బోస్ 10. ఇట్లు మారేడుమిల్లి 11. కార్తికేయ 2 12. డీజె టిల్లు 13. ఇక్షూ 14. ధమాకా 15. చదువే నా ఆయుధం 16. బింబిసార 17. భారత పుత్రులు 18. ఎట్ లవ్ 19. అశోకవనంలో అర్జున కల్యాణం 20. అల్లూరి. ఇన్ని సినిమాలు పంపిస్తే వాటిల్లో ఒక్కటంటే ఒక్కదానికి కూడా ఏ అవార్డూ దక్కలేదు. ఇది ఆలోచించాల్సిన అంశం. 'కార్తికేయ 2' చిత్రానికి ఇచ్చారు కదా అని అంటే అది ఉత్తమ ప్రాంతీయ చిత్రం కేటగిరిలో ఇచ్చిన అవార్డు. ఆ అవార్డు తెలుగు సినిమాకే ఇవ్వాలి కనుక కంటితుడుపు అన్నట్లు 'కార్తికేయ 2'కు ప్రకటించి చేతులు దులుపేసుకుంది అవార్డుల కమిటీ.

ఆ రెండు సినిమాలను పక్కన పెట్టేశారా?

'యుద్ధం రాసిన ప్రేమ లేఖ' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకొన్న చిత్రం 'సీతా రామం' వైజయంతీ మూవీస్ సంస్థ సగర్వంగా సమర్పించిన ఈ సినిమా సూపర్ హిట్ అయింది. ప్రేక్షకులను తిరిగి థియేటర్లకు రప్పించిన సినిమా ఇదని టాలీవుడ్ సెలబ్రేట్ చేసుకుంది. చక్కని కథ, కథనాలతో రూపుదిద్దుకున్న 'సీతారామం'కు జాతీయ అవార్డు ఖాయం అని అందరూ అనుకున్నారు. తీరా శుక్రవారం ప్రకటించిన అవార్డుల జాబితాలో ఆ సినిమా ఊసే లేదు. విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే 'సీతారామం' చిత్రం చివరి వరకూ పోటీలో ఉంది. అయితే అందులో సుమంత్ పోషించిన పాత్ర పాకిస్థాన్‌కు అనుకూలంగా ఉందనే సాకుతో అవార్డుల కమిటీ సినిమాను పక్కను పెట్టేసిందట. అలాగే నక్సలైట్లకు అనుకూలంగా, నక్సలిజాన్ని సమర్థించే రీతిలో 'విరాటపర్వం' చిత్రం ఉందంటూ ఆ సినిమాను కూడా పక్కన పెట్టేశారని అంటున్నారు. కల్యాణ్‌రామ్ నటించిన 'బింబిసార' చిత్రం కూడా కొత్త తరహా ప్రయత్నం. ఆ సినిమాను కూడా అవార్డుల కమిటీ పట్టించుకోలేదు. జ్యూరీలో తెలుగు సభ్యుడు కనీసం ఒకరున్నా తెలుగు సినిమాకు ఇలా అన్యాయం జరిగేది కాదనీ, ఫైట్ చేసి ఏదో ఒక సినిమాకు అవార్డ్ తీసుకువచ్చేవారని అంటున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు సంబంధించిన సభ్యులు ఎవరూ లేకపోవడంతో . ఇతర భాషల వారు పెత్తనం చెలాయించి, అవార్డుల పరంగా తెలుగు సినిమాకు అన్యాయం చేశారని చిత్ర ప్రముఖులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వారికి అవార్డులు ఇచ్చారు కానీ..

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితులైన ముగ్గురికి ఈసారి జాతీయ అవార్డులు రావడం కొంతలో కొంత ఉపశమనం. అయితే వారు అవార్డులు పొందింది తెలుగు చిత్రాలకు కాదు.. తెలుగేతర చిత్రాలకు.

నిత్యా మీనన్‌కు జాతీయ ఉత్తమ నటిగా అవార్డ్ వచ్చింది. అయితే తెలుగు సినిమా కాదు 'తిరుచిత్రంబలం' తమిళ చిత్రం. అలాగే ఎ.ఆర్.రెహమాన్ కూడా తమిళ చిత్రం 'పొన్నియిన్ సెల్వన్ 1' చిత్రానికే ఉత్తమ నేపథ్య సంగీతం అవార్డ్ పొందారు. అదే విధంగా కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ కూడా తమిళ సినిమాతోనే జాతీయ అవార్డ్ పొందారు.

70 వ జాతీయ చలనచిత్ర అవార్డులు

ఉత్తమ చిత్రం: 'ఆట్టమ్ (మలయాళం)

ఉత్తమ నటుడు: రిషబ్ శెట్టి (కాంతార- కన్నడం)

ఉత్తమ నటి: నిత్యా మీనన్ (తిరుచిత్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్‌ప్రెస్- గుజరాతీ)

ఉత్తమ దర్శకుడు: సూరజ్ బర్జాత్యా (ఉంఛాయి- హిందీ)

హోల్‌సమ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఫిల్మ్: కాంతార (కన్నడ)

ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్ ఫిల్మ్: బ్రహ్మాస్త్ర పార్ట్ 1 - శివ

ఉత్తమ నూతన దర్శకుడు: ప్రమోద్‌కుమార్- (ఫౌజ- హరియాన్వి)

ఉత్తమ సహాయ నటి: నీనా గుప్తా (ఉంఛా- హిందీ)

ఉత్తమ సహాయ నటుడు: పవన్ రాజ్ మల్హోత్రా- (ఫౌజ)

ఉత్తమ బాలనటుడు: శ్రీపథ్ (మాలికాపురం- మలయాళం)

ఉత్తమ ఛాయాగ్రాహకుడు: రవి వర్మన్ (పొన్నియిన్ సెల్వం 1)

ఉత్తమ స్క్రీన్ ప్లే రచయిత: ఆనంద్ ఏకార్షి(ఆట్టమ్)

ఉత్తమ సంభాషణల రచయితలు: అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టేలా (గుల్ మొహర్)

ఉత్తమ సంగీత దర్శకుడు (పాటలు): ప్రీతమ్ (పొన్నియిన్ సెల్వం 1)

ఉత్తమ సంగీత దర్శకుడు (నేపథ్యం): ఏ.ఆర్.రెహమాన్ (పొన్నియిన్ సెల్వం 1)

ఉత్తమ గీత రచయిత: నౌషాద్ సదర్ ఖాన్-(ఫౌజ)

ఉత్తమ నేపథ్య గాయకుడు: అర్జిత్ సింగ్ (బ్రహ్మాస్త్ర 1 - శివ)

ఉత్తమ గాయని: బాంబే జయశ్రీ (సౌదీ వెల్లక్క సీసీ 225 -2009)

ఉత్తమ ప్రాంతీయ చిత్రం: (కార్తికేయ 2 - తెలుగు)

ప్రత్యేక ప్రశంస: నటుడు మనోజ్ వాజ్‌పాయ్ (గుల్ మోహర్- హిందీ), సంగీత దర్శకుడు - సంజోయ్ సలీల్ చౌదరి (కదికన్ - మలయాళం)

ఉత్తమ ఎడిటర్: మహేశ్ భువనేంద్ (ఆట్టమ్)

ఉత్తమ యాక్షన్ డైరెక్టర్: అన్బరివు (కేజీఎఫ్ 2'

బెస్ట్ బుక్ ఆన్ సినిమా: కిశోర్‌కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ)- రచయితలు- అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్

బెస్ట్ క్రిటిక్: దీపక్ దుహా (హిందీ)

రైలు ఢీకొని యువకుడి మృతి

దత్తిరాజేరు: గుర్తు తెలియని రైలు ఢీకొని ఒకరు మృతిచెందారు. జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ బి.ఈశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున బలిరెడ్డి సురేష్ (26) పెదమానాపురం వద్ద పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడిది పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం అని తెలిపారు. తన నాయనమ్మ స్వగ్రామమైన పెదమానాపురం వచ్చినట్టు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమ్మితం గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి.. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

బైకులు ఢీ: ఇద్దరికి గాయాలు

బాడంగి: రామచంద్రాపురం వాటర్ ట్యాంకు వద్ద శుక్రవారం స్కూటీ, బైకు ఢీకొన్న సంఘటనలో కోడూరు గ్రామానికి చెందిన రైతు సత్యనారాయణ, పాములవలసకు చెందిన సునీల్ గాయపడ్డారు. సత్యనారాయణ కోడూరు నుంచి మల్లంపేట వెళుతున్నారు. తెర్లాం మండలం పాములవలస గ్రామానికి చెందిన కొన్న సునీల్ మోటారు సైకిల్‌పై వస్తున్నారు. రామచంద్రపురం వాటర్ ట్యాంకు వద్ద ఎదురెదురుగా ఢీకొన్నారు. దీంతో సత్యనారాయణకు కుడి చెయ్యి, వెన్నెముక దెబ్బతినడంతో విజయనగరం ఆసుపత్రికి తరలించారు. సునీల్‌కు స్వల్ప గాయాలు కావడంతో స్థానిక పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్నారు.

ఉచిత వైద్యశిబిరాలు



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎమ్మెల్యే బేబీనాయన

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో శుక్రవారం నిర్వహించిన ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఎమ్మెల్యే బేబీనాయన ప్రారంభించారు. గొల్లపల్లి గ్రామస్తులు నిర్వహించిన శిబిరంలో బేబీనాయనతో పాటు, జనసేన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పాలూరు బాబు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య, మెగా రక్తదాన శిబిరాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి, సంఘ అధ్యక్షుడు మోహనరావు, చిరంజీవిరావు, రెడ్డి నతానియేలు, గంపరాయి తిమోతిరాజు, శామ్యూల్, డేవిడ్ రాజు, ధనంజయనాయుడు, బీపీఎఫ్ఏ చైర్మన్ కొల్లా అదృష్టకుమార్, పాకా సురేన్‌బాబు పాల్గొన్నారు.

మురుగు సమస్య లేకుండా చూడండి



మురుగు కాలువను పరిశీలిస్తున్న మంత్రి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: విజయనగరంలోని గంట స్తంభం ప్రాంతంలో పాలిథిన్, ఇతర వ్యర్థాలతో నిండి ఉన్న కాలువను రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడులు శుక్రవారం పరిశీలించారు. ఈ కాలువ పరిస్థితిని మెరుగుపరచాలని, తక్షణమే వ్యర్థాలను తొలగించాలని కమిషనర్ ఎంఎం నాయుడును ఆదేశించారు. జిల్లా కేంద్రంలో మురుగునీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు.

మరువలేని నాయకుడు వాజ్‌పేయి



వాజ్‌పేయి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట: మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి గొప్ప మహనీయుడని, దేశం మరువలేని నాయకుడని బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు భవిరెడ్డి శివప్రసాద్‌రెడ్డి కొనియాడారు. వాజ్‌పేయి వర్ధంతి కార్యక్రమాన్ని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోపాలకృష్ణ, సీతారాం, జగ్గారావు, రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్ల సలహా కమిటీ సమావేశం



అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే

లక్కవరపుకోట: కొత్తవలస, ఎస్.కోట మండలాల బీసీ సంక్షేమ హాస్టళ్ల సలహా కమిటీ సమావేశం శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అధ్యక్షతన సమావేశం నిర్వహించి హాస్టళ్ల నిర్వహణ, సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వార్డెన్లతో పాటు డీటీ రమేష్, మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ కొల్లు రమణమూర్తి, ఎస్.కోట మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, కె.రాముడు, జి.ప్రసాద్, భూపాల్ నాయుడు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

బొబ్బిలి రూరల్: ఎరకందొరవలసలో శుక్రవారం వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘ అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో గిరిజన పేద మహిళలు, బాలలు, వృద్ధులకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కృష్ణదాస్, వీఎస్‌శర్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూముల రికార్డుల భద్రతకు చర్యలు

- రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా



సమావేశంలో మాట్లాడుతున్న సిసోడియా

కలెక్టరేట్: భూముల రికార్డులను పరిశీలించడానికి, రైతులు, ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి రోజుకో జిల్లా చొప్పున పర్యటిస్తున్నట్లు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆయన శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. భోగాపురం మండలం పోలిపల్లి, బసవ పాలెం గ్రామాలను సందర్శించామని, ఎఫ్‌సీవో, పాత అడంగల్, 22ఏ జాబితాలను పరిశీలించామని చెప్పారు. కొన్ని రికార్డుల్లో భూముల వర్గీకరణలో గుర్తించిన తేడాలను సరిచేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. జిల్లాలోని సుమారు 5,700 ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారని, దానిలో 191 ఎకరాల వరకూ రిజిస్ట్రేషను పూర్తయ్యాయని తెలిపారు. నిబంధనలు ప్రకారం ఫ్రీహోల్డ్ జరిగిందా? లేదా? రిజిస్ట్రేషన్లు సక్రమంగా జరిగాయా? లేదా అనే విషయాన్ని పరిశీలించామని తెలిపారు.

ఇళ్ల పథకం భూములపై ఆరా..

జిల్లాలోని పేదలందరికీ ఇళ్ల పథకంలో కేటాయించిన భూముల వివరాలను నిర్దేశిత నమూనాలో సమర్పించాలని ఆయన చెప్పారు. ఈ పథకం కింద ఎంత భూమి కేటాయించారు? అందులో ప్రభుత్వ భూమి ఎంత? డి.పట్టా భూమి ఎంత? ఎంత కొనుగోలు చేశారు? పరిహారం ఎంత చెల్లించారు? ఇళ్ల కోసం కేటాయించగా... ఇంకా ఎంత మిగిలింది? లబ్ధిదారుల అర్హత వివరాలతో రెవెన్యూ సదస్సుల్లో సమర్పించాలని సూచించారు. గత ఐదేళ్లలో 22ఏ కింద నోటిపై చేసిన భూముల వివరాలను, మ్యుటేషన్ సేవలను మండలాల వారీగా పరిశీలించారు. 20 ఏళ్ల క్రితం వరకూ ఫ్రీ హోల్డ్‌లో ఉన్న భూములను వెరిఫికేషన్ చేయవలసి ఉందన్నారు. సబ్ రిజిస్ట్రార్ రికార్డులు, తహసీల్దార్ రికార్డులలో ఉన్న వివరాలు ఒకేలా ఉండాలని చెప్పారు.

భద్రతపై దృష్టి

జిల్లాలోని అన్ని రెవెన్యూ కార్యాలయాల్లో ఉన్న భూ రికార్డులకు ప్రతిష్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని ఆయన ఆదేశించారు. కార్యాలయాలకు అగ్ని ప్రమాదాల నుంచి రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని, సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలన్నారు. రాత్రి సమయంలో వాచ్‌మెన్‌ను నియమించాలని చెప్పారు. కలెక్టర్ అంబేద్కర్, జేసీ సేతుమాధవన్ తదితరులు పాల్గొన్నారు.

సిసోడియాను కలిసిన ఎస్పీ

విజయనగరం క్రైం: రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాను ఎస్పీ వకుల్ జిందాల్ జడ్పీ అతిథి గృహంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి, మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలో పరిస్థితులు, భూ అక్రమణలు తదితర వాటిపై ఇరువురూ చర్చించారు.

అక్రమాలపై చర్యలు తీసుకోండి..

కలెక్టరేట్: క్షేత్ర స్థాయిలో కొన్ని చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో అధికారులకు ఫిర్యాదులు చేసినా ఇప్పటి వరకూ పరిష్కారం కాలేదు. గత ప్రభుత్వం నిర్వహించిన భూముల రీ సర్వే వల్ల కొత్త సమస్యలు వచ్చాయి తప్ప పరిష్కారం కాలేదు. రెవెన్యూ రికార్డుల్లో అనేక చోట్ల పేర్లు మారిపోయాయి. దీని వల్ల ఇబ్బంది పడుతున్నాం. ఈ అక్రమాలపై చర్యలు తీసుకుని లోపాలను సరిదిద్దాలంటూ వివిధ గ్రామాల రైతులు రెవెన్యూ శాఖ ప్రత్యేక కార్యదర్శి సిసోడియాకు మొర పెట్టుకున్నారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో భూ సమస్యలపై రైతులు వినతులు సమర్పించారు. వివిధ సమస్యలపై 80 వినతులు వచ్చాయి. నేరుగా వినతులు స్వీకరించిన ప్రత్యేక కార్యదర్శి సిసోడియా పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు అందించారు.

చెరువు గర్భం రిజిస్ట్రేషన్..

'డెంకాడ మండలం గుణుపూరు రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 60-3లో ఆనందరాజు చెరువు 22.24 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఈ చెరువు కింద 30 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ చెరువు గర్భాన్ని ఈ ఏడాది మే 24, 25 తేదీల్లో కొందరు వ్యక్తులు బినామీ పేర్లతో సుమారు 15 ఎకరాల మేరకు భోగాపురం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. రైతుల ఆందోళనతో రిజిస్ట్రేషన్లు రద్దు చేసినట్లు సబ్ రిజిస్ట్రార్ ప్రకటించారు. అయినా బినామీ పేర్లతో ఇంకా 1 బిలు ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నాయి. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశాం. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోలేదు. మరోవైపు అనందరాజు చెరువు కింద సాగు చేస్తున్న అర్హులైన రైతులకు 1బిలు ఉన్నాయి. కానీ అర్హుల పేర్లు తొలగించి.. అనధికారికంగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల పేర్లు నమోదు చేశారు. అక్రమార్కులపై చర్యలు తీసుకుని నిజమైన రైతులకు న్యాయం చేయాల'ని దామోదరరావు, కామేష్‌రావు, ఈశ్వరరావు సిసోడియాను కోరారు.

ఆ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించాలి

'జిల్లాలో రీసర్వే పూర్తయిన గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి వీఆర్‌వో, సర్వేయర్ ఆదే గ్రామంలో ఉండేలా చూడాలి. తహశీల్దార్ కార్యాలయంలో మ్యుటేషన్ కోసం వెళ్తున్న చిన్న, సన్న కార రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారు. రెవెన్యూ అధికారులు అక్రమాలకు పాల్పడంతో మ్యుటేషన్ దరఖాస్తులను తిరస్కరణకు గురవుతున్నాయి. వీటిని సరి చేసి రైతులకు న్యాయం చేయాల'ని ఏపీ రైతు సంఘ నాయకులు రాంబాబు, ఆదినారాయణలు రెవెన్యూ కార్యదర్శికి విన్నవించారు.

లేఅవుట్ ప్లాట్లకు 1బీ ఇచ్చారు..

'విజయనగరం పట్టణంలోని ధర్మపురి రెవెన్యూ పరిధిలో 1982లో రైల్వే కోఆపరేటివ్ సొసైటీ పేరిట 4 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేశారు. అందులో వేసిన ప్లాట్లను అప్పట్లో చాలా మంది ఉద్యోగులు కొనుగోలు చేసుకున్నారు. 2022లో ఓ ప్రజా ప్రతినిధి పేరున అప్పటి రెవెన్యూ అధికారులు 1బి ఇచ్చారు. పురపాలక శాఖకు పన్ను చెల్లిస్తుండగా 1బి ఎలా మంజూరు చేశారో తెలియడం లేదు. కోర్టులో కేసు ఉంటుండగా 1 బి మంజూరు చేయడం సరికాదు. దీనిపై విచారణ చేపట్టి.. న్యాయం చేయాల'ని ప్లాటు కొనుగోలుదారుడు మోహనరావు ఫిర్యాదు చేశారు.

గంజాయి నిరోధంపై ప్రత్యేక దృష్టి

- ఎస్పీ వకుల్ జిందాల్



గంజాయితో దొరికిన నిందితులతో ఎస్పీ వకుల్ జిందాల్, సిబ్బంది

విజయనగరం క్రైం: గంజాయి అక్రమ రవాణా, నిరోధంపై ప్రత్యేక దృష్టి పెడతామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. రామభద్రపురం మండలం కొట్టక్కి గ్రామం వద్ద శుక్రవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఒక వ్యక్తి నుంచి మోటారు సైకిల్, గంజాయిని స్వాధీ నం చేసుకున్నారు. ఆ వివరాలను ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొట్టక్కి చెక్‌పోస్టు వద్ద ఎస్ఐ జ్ఞానప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసుల బృందం వాహన తనిఖీలు చేపట్టారు. వాహనం సీటులో స్పాంజ్‌కు బదులుగా గంజాయిని కుక్కి ఒడిశాలోని సుంకి నుంచి రాయగడకు తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఒడిశా రాష్ట్రం కలహండి జిల్లా అంపనీ పోలీసు స్టేషన్ పరిధిలోని హరిప్రసాద్ హంసా అనే వ్యక్తిని అరెస్టు చేశారు. అతని నుంచి 20 కిలోల గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మల్కనగిరి జిల్లా గురసేతు గ్రామానికి చెందిన జిను పంగీ అనే వ్యక్తి గంజాయి సరఫరా చేస్తున్నారని, పతి సిగోల్ అనే వ్యక్తి మధ్యవర్తిగా వ్యవహరించినట్టు గుర్తించామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. త్వరలో వారిని అరెస్టు చేస్తామని చెప్పారు.

బొబ్బిలి పట్టణ పరిధిలో..

బొబ్బిలి పట్టణ పరిధిలోని శ్మశాన వాటిక మైదానంలో బొబ్బిలి సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్టు చేసి 16 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మరో ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కర్ణాటక రాష్ట్రం తుమకూరు జిల్లాకు చెందిన నాగాలాపురం లోహిత్, అలియాస్ లోహిత్ భరత్ నుంచి ఆరు కిలోలు, బొబ్బిలి పట్టణానికి చెందిన చింతాడ సారథి అలియాస్ నాని నుంచి నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. బొబ్బిలికి చెందిన శిమిడి ప్రేమ్ కుమార్, లంకా నిఖిల్, దేవుపల్లి చందన్‌అలియాస్ భంజు గంజాయి వ్యాపారంలో సహాయ పడినట్టు ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వీరితో పాటు ముగ్గురు జువెనైల్స్ కూడా అక్రమంగా గంజాయిని తరలించడంలో సహకరించడంతో అదుపులోకి తీసుకున్నామన్నారు. లోహిత్, భరత్‌పై ఇప్పటికే పార్వతీపురం పట్టణంలో గంజాయి కేసు నమోదైందని తెలిపారు. ఈ సమావేశంలో బొబ్బిలి డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ నాగేశ్వరరావు, ఎస్‌బీ సీఐలు విజయనాథ్, నర్సింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాదారుడి అరెస్టు..

విజయనగరం క్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ రహదారిలో వ్యక్తిని అదుపులోకి తీసుకుని నాలుగు కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్టు వన్‌టౌన్ సీఐ ఎస్‌శ్రీనివాస్ తెలిపారు. రైల్వే స్టేషన్ రహదారిలో ఎస్ఐ నవీన్‌పడాల్, ఎస్‌బీ సిబ్బంది తనిఖీలు నిర్వహించగా, ఒడిశా రాష్ట్రం సబల్‌పూర్ జిల్లాలోని బిక్సిరా గ్రామానికి చెందిన గోవర్ధన్ పటేల్ వద్ద గంజాయి దొరికింది. అదే ప్రాంతానికి చెందిన మనోజ్ వ్యక్తి ద్వారా విజయనగరం వచ్చారని తెలిపారు. గోవర్ధన్ పటేల్‌ని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు.



రామ్మోహన్‌నాయుడికి వినతిపత్రం అందజేస్తున్న వెంకటరావు తదితరులు

గ్రామ పంచాయతీల బలోపేతానికి సహకరించాలి

- కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడికి వినతి

రాజాం రూరల్: గ్రామ పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి, రాజాం మండలం ఒమ్మి సర్పంచి వంగా వెంకటరావు కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడికి విజ్ఞప్తి చేశారు. మినిస్ట్రీ ఆఫ్ డిఫెన్స్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని ఎర్రకోటలో నిర్వహించిన 78వ స్వాతంత్ర్య వేడుకలలో పాల్గొన్న ఆయన శుక్రవారం జిల్లాలోని సర్పంచులతో కలిసి రామ్మోహన్‌నాయుడిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు ఆదినారాయణ, సుందరరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధుడికి సన్మానం



శతాధిక వృద్ధుడిని సత్కరిస్తున్న గ్రామస్తులు

బొబ్బిలి రూరల్: పారాది గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు అల్లాడ తమ్మినాయుడు (109)ను స్థానికులు శుక్రవారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ తమ్మినాయుడు తన యుక్త వయసు నుంచి ఆధ్యాత్మిక కుసుమాలను గ్రామంలో వికసింపజేసేందుకు ఎంతో పరితపించేవారని కొనియాడారు. శతాధిక వృద్ధుడిని తమ గ్రామానికి సొత్తుగా భావిస్తున్నామని తెలిపారు. తమ్మినాయుడు మాట్లాడుతూ తనకు భార్యాపిల్లలు లేరని... లక్ష్మి అనే అమ్మాయిని పెంచి పెద్ద చేసి పెళ్లి చేశానని చెప్పారు. తన పోషణ భారం ఆమె చూస్తోందని వివరించారు.

ఏనుగుల దాడిలో పంటలు ధ్వంసం



ఏనుగుల దాడిలో దెబ్బతిన్న విద్యుత్ మోటార్లను చూస్తున్న రైతు

వంగర: వీవీఆర్‌పేట, రాజులగుమ్మడలో తిష్టవేసిన ఏనుగుల గుంపు రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే రెండు గ్రామాల్లో 15 ఎకరాల్లో వరి, అరటి, మొక్కజొన్న పంటలను ధ్వంసం చేశాయి. శుక్రవారం రాజులగుమ్మడలోని వెంకటనాయడు, సత్యనారాయణలకు చెందిన పామాయిల్ తోటను, విద్యుత్ మోటార్లు, డ్రిప్ పరికరాలను ధ్వంసం చేశాయి.

జూట్ మిల్లును తెరిపించండి

కొత్తవలస: సీతంపేటలోనున్న జూట్‌మిల్ లాకౌట్‌ను వెంటనే ఎత్తివేయాలని కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గణేష్ పండా శుక్రవారం డిమాండ్ చేశారు. లాకౌట్ కారణంగా 400 మంది కార్మిక కుటుంబాలు వీధిన పడ్డాయన్నారు. కార్మికుల జీతాలలో నుంచి కోసిన ఈఎస్ఐ, పీఎఫ్ మొత్తాన్ని సైతం ప్రభుత్వం వద్ద యాజమాన్యం జమ చేయలేదన్నారు. అధికారులు నోటీసులు జారీ చేసినా యాజమాన్యం స్పందిచడం లేదన్నారు. తక్షణమే మిల్లును తెరిపించాలని కోరారు.

వయనాడ్ బాధితులకు విరాళం

బొబ్బిలి రూరల్: కేరళ వయనాడ్ బాధితుల కోసం వీర బొబ్బిలి మాజీ సైనిక సంక్షేమ సంఘం అధ్యక్షులు రేవళ్ల కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్నారు. ఎమ్మెల్యే బేబీనాయన శుక్రవారం రూ.20 వేల చెక్కును కమిషనర్ రామలక్ష్మి సమక్షంలో రేవళ్ల కిరణ్ కుమార్‌కు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో సంఘ గౌరవ అధ్యక్షులు మరడ అప్పారావు, ట్రెజరర్ వీఎస్ శర్మ, ఎస్ఆర్ మోహనరావు, పి.సురేష్ బాబు, ఎ.గోవిందనాయుడు పాల్గొన్నారు.

కషాయంతో చీడపీడల నివారణ

బొబ్బిలి రూరల్: కషాయంతో పంటల్లో చీడపీడలను నివారించవచ్చని వ్యవసాయ శాఖ ఏడీఏ శ్యాంసుందర్ తెలిపారు. పారాది గ్రామంలో శుక్రవారం రైతులకు వేపగింజల కషాయం తయారీపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, ప్రకృతి సేద్య ప్రతినిధి శంకరరావు, రైతులు పాల్గొన్నారు.

స్టీల్ క్యారేజీల వితరణ

బొబ్బిలి రూరల్: కోమటిపల్లిలో బొంతలకోటి శంకరరావు, లక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో గత 308 రోజులుగా వృద్ధులకు, వికలాంగులకు ఇళ్లకు వెళ్లి ఆహారం అందిస్తున్నారు. వారికి ఆహారాన్ని పంపిణీ చేయడానికి హైదరాబాద్‌కు చెందిన సహాయ టీమ్ వారు 50 స్టీల్ క్యారేజులు ఉచితంగా అందించారని శంకరరావు శుక్రవారం తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

బొబ్బిలి రూరల్: బొబ్బిలి 132/33 కేవీ సబ్ స్టేషన్ నిర్వహణ పనుల కారణంగా 33 కేవీ కలవరాయి, బలిజిపేట, ఆరోరా, సిరి స్మెల్లర్స్ ఫీడర్ల పరిధిలో శనివారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏఈ ఆవాల అనంతరావు తెలిపారు. బలిజిపేట, పినపెంకి, వంతరాం, నెమలాం, జగన్నాథపురం, కలవరాయి, పెంట, పిరిడి సబ్ స్టేషన్ల పరిదిలో గల గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు.

బ్యాడ్మింటన్ పోటీలకు ఎస్.కోట విద్యార్థులు

శృంగవరపుకోట: ఎస్.కోట ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు బర్నికాన హారిక, పంపాన మౌనిక రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ రెడ్డి శివకుమార్ శుక్రవారం తెలిపారు. ప్రిన్సిపాల్ కేశవరావు, అధ్యాపకులు ఆ విద్యార్థులను అభినందించారు.

జీఆర్‌పీ ఎస్ఐగా బాలాజీరావు

విజయనగరం క్రైం: విజయనగరం రైల్వే ఎస్ఐగా వి.బాలాజీరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. విశాఖ జీఆర్‌పీ స్టేషన్ నుంచి బదిలీపై విజయనగరం స్టేషన్‌కు వచ్చారు. బాధ్యతలు చేపట్టిన బాలాజీ రావును జీఆర్‌పీ సిబ్బంది అభినందించారు.

మాజీ మంత్రి వాసిరెడ్డి జయంతి



వాసిరెడ్డి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బొబ్బిలి: దివంగత మాజీ మంత్రి వాసిరెడ్డి కృష్ణమూర్తి నాయుడు జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక రైల్వే సెంటరులో గల ఆయన విగ్రహానికి కొప్పులవెలమ సేవా సంఘ నాయకులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కొప్పుల వెలమ సంఘం నేత కర్రి సత్యనారాయణ, గొట్టాపు కృష్ణమూర్తి, వాసిరెడ్డి తనయుడు జగదీశ్ (తాతాజీ), రెడ్డి కృష్ణమూర్తి, కేతిరెడ్డి కృష్ణమూర్తి, బలగ సాయికృష్ణ, తిరుపతిరావు, వాలేటి తవిటినాయుడు, కొల్లి రామారావు, రెడ్డి దామోదరరావు, కుదమాల శివకుమార్, చౌదరి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన ఎంపీ



సీఎం చంద్రబాబుకు పీవీజీ రాజు పుస్తకాన్ని అందజేసిన ఎంపీ కలిశెట్టి

విజయనగరం (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు శుక్రవారం దేశ రాజధాని ఢిల్లీలో మర్యాద పూర్వకంగా కలిశారు. పీవీజీ రాజు జీవిత చరిత్ర పుస్తకాన్ని ముఖ్యమంత్రికి అందజేశారు.

ఎస్ఎంసీ ఎన్నికపై విచారణ నిర్వహించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘ నాయకులు

మక్కువ: ములక్కాయవలస ఆదర్శ పాఠశాలలో ఈనెల 8న జరిగిన పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికపై విచారణ నిర్వహించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆ పాఠశాల వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్నిక ప్రక్రియకు సంబంధించి పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.స్వర్ణలతను విద్యాశాఖాధికారులు సస్పెండ్ చేయడం విడ్డూరంగా ఉందన్నారు. వసతిగృహాల్లో, కళాశాలల్లో విద్యార్థుల సమస్యలపై ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించకపోగా రాజకీయాలకైతే మాత్రం స్పందించడం దారుణమన్నారు. జిల్లాలో విద్యార్థుల సమస్యలపై స్పందించకపోతే కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారం మానుకోండి


మాట్లాడుతున్న ఉదయశేఖరపాత్రుడు

కొమరాడ: కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిపై కొంతమంది తప్పుడు ప్రచారం చేయడం మానుకోవాలని మండల బీసీ నాయకులు హితవు పలికారు. శుక్రవారం టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖరపాత్రుడు ఆధ్వర్యంలో కొమరాడలో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే బీసీల ద్రోహి అని అన్నవారే నిజమైన ద్రోహులని అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే బీసీల కోసం అనేక కార్యక్రమాలను ఎమ్మెల్యే చేసినట్టు వివరించారు. ముఖ్యంగా వ్యవసాయం చేసే రైతులకు నష్టపరిచే ఏనుగుల గుంపు తరలింపు విషయంలో ఎమ్మెల్యే తీసుకున్న చొరవ ప్రతిఒక్కరికీ తెలిసిందేనని అన్నారు. ఈ ప్రాంతం నుంచి ఏనుగులు తరలిపోతే ఎక్కువగా లబ్ధి పొందేది బీసీ కులస్తులేనన్న విషయం ప్రతి బీసీ నాయకుడు గుర్తించాలన్నారు. పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణం కోసం అహర్నిశలు కష్టపడుతున్న ఎమ్మెల్యేపై విమర్శలు మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డి.వెంకటనాయుడు, మధుసూదనరావు, పి.వెంకటినాయుడు, సుదర్శనరావుతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

వెంగళరాయసాగర్‌లో గుర్తు తెలియని మృతదేహం

సాలూరు రూరల్: వెంగళరాయసాగర్‌లో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించామని సాలూరు రూరల్ ఎస్ఐ ఎం.వెంకటరమణ చెప్పారు. ఆయన శుక్రవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. వెంగళరాయసాగర్‌లో మృతదేహం తేలినట్టు సమాచారం అందడంతో వెళ్లి దానిని స్వాధీనం చేసుకున్నామన్నారు. మృతుడికి 40 ఏళ్ల లోపు వయస్సు ఉంటుందని చెప్పారు. బ్లూకలర్ జీన్ ప్యాంట్, కుంకుమ కలర్ చొక్కా ధరించి ఉన్నాడన్నారు. ఎవరైన గుర్తు పడితే తన ఫోన్ నెంబర్ 9121109472కు కాల్ చేయాలని కోరారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఉపాధ్యాయులకు క్రీడా పోటీలు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఈవో రాజకుమార్

సాలూరు రూరల్: యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు సందర్భంగా సాలూరులోని ఆ సంఘం మండలశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను డిప్యూటీ డీఈవో బత్తుల రాజకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నేతలు గణేష్, గణపతి, జగదీష్, రాజమణి, సబేరా బేగం తదితరులు పాల్గొన్నారు.

అధిక దిగుబడికి రైతులు కృషి చేయాలి


పొలంబడిలో రైతులకు సూచనలు చేస్తున్న ఏవో

భామిని: ఏ పంటలు వేసినా అధిక దిగుబడి కోసం రైతులు కృషి చేయాలని వ్యవసాయాధికారి కె.సింహాచలం రైతులను సూచించారు. శుక్రవారం గురండిలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాల్లో ఒక చదరపు మీటరుకు 33 దుబ్బులు ఉండాలని తెలిపారు. దీనివల్ల దిగుబడి పెరుగుతుందన్నారు. గడ్డి, పిచ్చిమొక్కలు లేకుండా చూస్తే పంటకు ఎటువంటి తెగుళ్లు సోకవని తెలిపారు. ఈ కార్యక్రమంలో పొలంబడి ఫీల్డ్‌ఆఫీసర్ నిఖిల్, రైతులు శంకరరావు, మిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

భామినిలో భారీ వర్షం


భామినిలో కురుస్తున్న వర్షం

భామిని: మండలంలో కొరమ నుంచి సింగిడి గ్రామం వరకు శుక్రవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. గత కొద్దిరోజులుగా సరైన వర్షం లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఈ వర్షంతో కొంత ఊరటనిచ్చింది. కాగా వర్షాలు సరిగ్గా లేకపోవడంతో వాగులు, గెడ్డల్లో నీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరో రెండు, మూడు రోజుల్లో వర్షాలు విస్తారంగా కురిస్తే ఉభాలు చేసుకోవడానికి సిద్ధమవుతామని రైతులు చెబుతున్నారు.

కోటదుర్గమ్మకు మకరతోరణం బహూకరణ


ఆలయానికి మకరతోరణాన్ని బహూకరిస్తున్న దృశ్యం

పాలకొండ: పాలకొండలోని కోటదుర్గమ్మ అమ్మవారికి పట్టణానికి చెందిన దివంగత శిల్లా అనంతం, లక్ష్మీకాంతల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రెండు కేజీల 531 గ్రాములు బరువున్న మకరతోరణాన్ని బహూకరించారు. ఆలయ ఈవో మురళీకృష్ణ, ప్రధాన అర్చకుడు దార్లపూడి లక్ష్మీప్రసాదశర్మకు శుక్రవారం దీనిని అందజేశారు. అలాగే పట్టణానికి చెందిన ఎం.దుర్గాప్రసాద్ దంపతులు 984 గ్రాములు బరువున్న రెండు వెండి దీపం కుందులు బహూకరించారు.

పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు

● మంత్రి సంధ్యారాణి


పారమ్మకొండ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి

పాచిపెంట / సాలూరు: పర్యాటక అభివృద్ధికి ప్రభుత్వానికి రూ.20కోట్లకు ప్రతిపాదనలు పంపించామని రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ, స్త్రీ శిశు మహిళా సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని జాతీయ రహదారి నుంచి చెరుకుపల్లి మీదుగా పారమ్మకొండ వరకు రహదారి నిర్మాణానికి ఆమె శుక్రవారం శంకుస్థాపన చేశారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ.1.60 కోట్లు నిధులు మంజూరయ్యాయని చెప్పారు. పారమ్మతల్లిని దర్శించుకునేందుకు ఉత్తరాంధ్రకు చెందిన భక్తులు అనేక ఇబ్బందులు పడేవారని, రహదారి నిర్మాణంతో ఈ ఇబ్బందులు తొలగిపోతాయన్నారు. రెండు వేల గిరిజన గ్రామాలకు రహదారులు నిర్మించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు చేపట్టారని చెప్పారు. సోమవారం జరిగిన కలెక్టర్ గ్రీవెన్స్‌లో అధికంగా భూ సమస్యలు వచ్చాయని, వీటిలో కుటుంబ కలహాల భూసమస్యలే ఉన్నాయన్నారు. వచ్చే నెలలో నిర్వహించే రెవెన్యూ సదస్సులో వాటిని పరిష్కరిస్తామన్నారు.

సాలూరు నియోజకవర్గాన్ని పర్యాటకంగా మారుస్తా

సాలూరు నియెజకవర్గంలోగల నాలుగు మండలాల్లో పేరు పొందిన ప్రదేశాలను పర్యాటక కేంద్రాలుగా మారుస్తానని మంత్రి సంధ్యారాణి తెలిపారు. వీటి నిమిత్తం రూ.20 కోట్లకు ప్రతిపాదనలు పంపించగా, రూ.12కోట్లు మంజూరయ్యే అవకాశం ఉందని చెప్పారు. టూరిజంలో భాగంగా మండలంలోని పారమ్మకొండపై శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్పీ భంజ్‌దేవ్, పార్టీ మండల అధ్యక్షుడు పిన్నింటి ప్రసాద్‌బాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ముఖి సూర్యనారాయణ, స్థానిక సర్పంచ్ సీతారాం, నాయకులు మంచాల పారమ్మ, గూడేపు యుగంధర్, పూసర్ల నరసింగరావు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు, మండల స్థాయి అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనే లక్ష్యం

● ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర

పార్వతీపురం రూరల్: కూటమి ప్రభుత్వంలో ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ములగ గ్రామం వద్ద వెలగవలస రోడ్డు నుంచి డోకిశీల, ఎస్.ములగతేలునాయుడవలస తదితర గ్రామాలకు రహదారి నిర్మాణ పనుల కోసం ఆయన శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం టీడీపీ మండల అధ్యక్షుడు బోను దేవిచంద్రమౌళి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామానికి పక్కా రహదారితో పాటు సీసీ రహదారులు, కాలువలు తదితర మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్టు చెప్పారు. టీడీపీ నాయకులు బి.చంద్రమౌళి, గురజాన చంద్రమౌళి, రెడ్డి చిన్నమనాయుడు, రెడ్డి శివ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● బందలుప్పి గ్రామంలో తాగునీటి పనులు మధ్యలో నిలిచిపోయాయని, గ్రామానికి బస్సు సదుపాయం లేదని, తదితర సమస్యలను ఎస్.శంకరరావు తదితర టీడీపీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. సంఘంవలస సర్పంచ్ అమరాపు రామకృష్ణ, తాళ్లబురిడికి చెందిన టీడీపీ నాయకుడు శ్రీరాములు రహదారి సమస్య పై ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అదేవిధంగా తాగునీటి సమస్యపై పార్టీ నాయకుడు లక్ష్మణరావు వివరించారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీఇచ్చారు.

ప్రమాదకర విద్యుత్ స్తంభాన్ని మార్చండి

పార్వతీపురం రూరల్: మండలంలోని కవిటిభద్ర గ్రామం వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాన్ని మార్చి, వైర్లను తొలగించాలని ఎమ్మెల్యే విజయచంద్ర ఏపీ ట్రాన్స్‌కో మండల అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ములగ గ్రామం నుంచి కవిటిభద్ర వస్తుండగా స్థానికులు తమ సమస్యను వివరించారు. దీంతో ఆయన వెంటనే ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఏపీ ట్రాన్స్‌కో అధికారులకు సమస్యను వివరించారు. వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

వంతెన పనుల పరిశీలన

సీతానగరం (బలిజిపేట): బలిజిపేట మండలం నారాయణపురం వద్ద నిర్మితమవుతున్న వంతెన పనులను ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర శుక్రవారం పరిశీలించారు. టీడీపీ హయాంలో వంతెన పనులకు శంకుస్థాపన చేసినప్పటికీ వైసీపీ ప్రభుత్వం దీనిని పూర్తి చేయలేకపోయిందని అక్కడ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. శరవేగంతో పనులు జరిగేలా చూడాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. అనంతరం పి.చాకరాపల్లి రహదారి పనులు విషయంపై నాయకులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాపినాయుడు, అప్పారావు, రవి మాస్టారు, రాంబాబు, జగన్మోహన్‌తో పాటు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

త్వరలోనే అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తాం

బెలగాం: పార్వతీపురంలో త్వరలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. బెలగాంలోని అన్న క్యాంటీన్ పనులను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌తో కలిసి ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్వతీపురంలో వచ్చే మొదటివారంలో అన్న క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని తెలిపారు. క్యాంటీన్‌ను సంసిద్ధం చేయాలని కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనంత, శంకర్, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలపై దృష్టి


ముంపునకు గురైన గణేష్‌నగర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయచంద్ర

పార్వతీపురంటౌన్: పట్టణంలోని ముంపు ప్రాంతాలపై ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర దృష్టి సారించారు. వీటిపై శాశ్వత ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ముంపునకు గురైన 21వ వార్డు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో ఉన్న గణేష్‌నగర్ కాలనీని ఆయన శుక్రవారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని గణేష్‌నగర్‌తో పాటు లోతట్టు ప్రాంతాల్లో ఉన్న బైపాస్ కాలనీ, తదితర కాలనీల్లో వరదనీటి మళ్లింపునకు బృహత్తర ప్రణాళికలను సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో వరదనీటి మళ్లింపునకు ఒక పరిష్కార మార్గాన్ని చూపించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావుతో పాటు ప్రజారోగ్యశాఖ అధికారులకు ఆయన సూచించారు.

ఘనంగా గౌతులచ్చన్న జయంతి


సర్దార్ గౌతులచ్చన్న విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గరుగుబిల్లి: మండలంలోని నాగూరు, ఉల్లిభద్ర ప్రాంతాల్లో శుక్రవారం స్వాతంత్ర్య సమరయోధుడు సర్దార్ గౌతులచ్చన్న జయంతి వేడుకలను నిర్వహించారు. తోటపల్లి కుడి ప్రధాన కాలువ సమీపంలోని సర్దార్ గౌతులచ్చన్న విగ్రహానికి టీడీపీ మండల అధ్యక్షుడు అక్కేన మధుసూదనరావు, సంతోషపురం సర్పంచ్ అంబటి తవిటినాయుడు, మరడాన నారాయణస్వామితో పాటు పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వల్లరిగుడబ సర్పంచ్ ఆర్.గోవిందనాయుడు, ఎం.వెంకటనాయుడు, ఎ.జనార్ధనరావు, అక్కేన శేషగిరిరావు, తదితరులు పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలకు సాగునీరు అందించాలి

వీరఘట్టం: మండలంలోని శివారు ప్రాంతాలకు సాగునీరు అందించడంలో పాలకులు, అధికారులు పూర్తిగా విఫలమయ్యారని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.తిరుపతిరావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని గడగమ్మ, కొట్టుగుమ్మడ, నడుకూరు తదితర గ్రామాలను పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ద్వారా గత నెల 13వ తేదీన సాగునీరు విడిచిపెట్టి నేటికీ కూడా గ్రామాలకు చేరుకోలేదంటే పాలకులు, రైతులు పట్ల ఏ విధంగా పనిచేస్తున్నారో దీనిని బట్టి అర్థం చేసుకోచ్చునన్నారు. మరో పది రోజుల్లో సెప్టెంబరు నెల వస్తున్నప్పటికీ ఇంతవరకు నాట్లు వేయలేదన్నారు.

ఐఏఎస్ అధికారిని ఐటీడీఏ పీవోగా నియమించాలి


నిరసన తెలుపుతున్న ఆదివాసీలు

సీతంపేట: ఐటీడీఏ ప్రాజెక్టు అధికారిగా ఐఏఎస్ అధికారిని నియమించాలని గిరిజన సంఘాలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు శుక్రవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా గిరిజన ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి చౌదరి లక్ష్మీనారాయణ, గిరిజన ప్రజా సమాఖ్య ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షుడు సవర చిరంజీవులు మాట్లాడుతూ ఆర్డీవో స్థాయి అధికారులు పీవోలుగా ఉండడం వల్ల గిరిజనులకు పూర్తిస్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యకలాపాలు చేయలేని పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ప్రభుత్వం దీనిని దృష్టిలో ఉంచుకుని ఐటీడీఏ పీవోలుగా ఐఏఎస్ అధికారులను నియమించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సవర మోహన్‌పాల్, ట్రైబుల్ డెవలప్‌మెంట్ మిషన్ అధ్యక్షుడు మండంగి విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

చినమేరంగి సీఐ బదిలీ

జియ్యమ్మవలస: మండలంలో చినమేరంగి సర్కిల్ కార్యాలయ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి.మంగరాజుకు శ్రీకాకుళం జిల్లా సోంపేట సర్కిల్‌కు బదిలీ చేస్తూ ఈనెల 3వ తేదీన ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు విశాఖ రేంజ్ డీఐజీ నుంచి ఆయనకు ఉత్తర్వులు అందినా ఈ నెల 9న ముఖ్యమంత్రి కురుపాం నియోజకవర్గం గుమ్మలక్ష్మీపురం మండలంలో పర్యటన ఉందన్న నేపథ్యంలో సీఐ రిలీవ్ కాలేకపోయారు. శుక్రవారం ఆయన ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిపోయారు. కాగా చినమేరంగి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎవరిని నియమించారో ఇంకా తెలియాల్సి ఉంది.

అధ్వానంగా ప్రధాన రహదారి


ఉల్లిభద్ర సమీపంలోని ఎర్రన్నగుడి ప్రాంతంలో రహదారి దుస్థితి ఇదీ

గరుగుబిల్లి: మండలంలోని ప్రధాన రహదారి అధ్వానంగా తయారయ్యింది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా రహదారి గోతులమయంగా దర్శనమిస్తోంది. ఉల్లిభద్ర ప్రాంతంలో రహదారిపై నుంచి పరిమితికి మించిన భారీ వాహనాలు రాకపోకలు సాగించడంతో రహదారి పరిస్థితి ప్రమాదకరంగా మారింది. గోతుల్లో వర్షపు నీరు చేరడంతో గోతులు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో బొబ్బిలి సమీపంలోని పారాది వంతెన బలహీనంగా ఉండటంతో ఈ మార్గం భారీ వాహనాల రాకపోకలతో రద్దీగా మారింది. దీంతో రహదారి మరింత అధ్వానంగా తయారయ్యింది. అధికారులు దృష్టి సారించి రహదారి మెరుగుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఘనంగా శ్రావణ శుక్రవారం పూజలు

● భక్తులతో కిటకిటలాడిన జిల్లాలోని ఆలయాలు ● ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు


సాలూరు: కన్యాకాపరమేశ్వరీ ఆలయంలో మంత్రి సంధ్యారాణి దంపతులు


పార్వతీపురంటౌన్: కోటదుర్గ ఆలయంలో పూజలు చేస్తున్న దృశ్యం


భామిని: బత్తిలి సంతోషిమాత ఆలయం వద్ద క్యూలో ఉన్న భక్తులు

సాలూరు: పట్టణంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా కామాక్షి, కన్యాకా పరమేశ్వరీ, సంతోషిమాత ఆలయాల్లో ఘనంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తన భర్త జయకుమార్‌తో కలిసి కన్యాకాపరమేశ్వరీ ఆలయంలో పూజలు నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు అధికసంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ● **పార్వతీపురంటౌన్:** మన్యం జిల్లా కేంద్రంలోని కోటదుర్గా ఆలయ ప్రాంగణంలో గల సర్వమంగళాదేవికి పీఠాధిపతి మురపాక కాళిదాసుశర్మ ఆధ్వర్యంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం ఉదయం 6 గంటల నుంచి ఆలయ ప్రాంగణంలో సర్వదేవతా ఆరాధనతోపాటు శ్రీలక్ష్మీ అవతారంలో ఉన్న సర్వమంగళాదేవికి భక్తులు ప్రత్యేక అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ● **భామిని:** శ్రావణ శుక్రవారం సందర్భంగా బత్తిలి సంతోషిమాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు.

పాఠశాలల అభివృద్ధికి చర్యలు

● ఎమ్మెల్యే జగదీశ్వరి


ఎస్ఎంసీ చైర్‌పర్సన్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

గరుగుబిల్లి: నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. టీడీపీ అరకు నియోజకవర్గ బీసీ సెల్ అధికార ప్రతినిధి ద్వారపురెడ్డి సత్యనారాయణ, నాగూరు జడ్పీ ఉన్నత పాఠశాల చైర్‌పర్సన్ లావేటి గౌరీశ్వరి శుక్రవారం గుమ్మలక్ష్మీపురంలో ఎమ్మెల్యేను కలిశారు. ఈసందర్భంగా వారు ఎమ్మెల్యే దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. రహదారికి అనుకుని ఉన్న ఉన్నత పాఠశాలలకు పూర్తిస్థాయిలో ప్రహరీలు లేక విద్యార్థులు పలు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. వెనుక భాగంలో చెరువులు ఉండడంతో కొంతమేర కోతకు గురవుతుందన్నారు. పాఠశాల లోపలకు వెళ్లేందుకు గేట్లు ఏర్పాటు ఏర్పాటు చేయాల్సి ఉందని వివరించారు. అలాగే పదో తరగతి పరీక్షల నిర్వహణకు కేంద్రంగా నాగూరును గుర్తించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పాఠశాలల పరిధిలోని ప్రధాన సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకు వెళ్లామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన బోధన, సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధులు మంజూరుకు వారు హామీ ఇచ్చారని తెలిపారు.

క్లుప్తంగా..

నేడు మండల సర్వసభ్య సమావేశం

మక్కువ: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ మర్రి పారమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో సీహెచ్ సూర్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

వికసిత్ ఆంధ్రాపై శిక్షణ

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి: వికసిత్ ఆంధ్రా కార్యక్రమంపై శిక్షణా కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్టు జిల్లా ప్రణాళికా అధికారి పి.వీరరాజు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పాల్గొంటారన్నారు. ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యా లయంలో ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని, సంబంధిత జిల్లా అధికారులు అందరూ హాజరు కావాలన్నారు.

20న డీవార్మింగ్ డే

గరుగుబిల్లి: డీవార్మింగ్ డే సందర్భంగా ఈనెల 20న పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలు వేయిస్తామని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కేకే సాగర్‌వర్మ తెలిపారు. శుక్రవారం ఆయన పీహెచ్‌సీలో మాట్లాడుతూ ఆల్బెండజోల్ మాత్రలతో పిల్లల్లో రక్త హీనతను నివారించవచ్చని చెప్పారు. ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తద్వారా రోగాలకు దూరంగా ఉండవచ్చని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పార్వతీపురంటౌన్: పట్టణంలోని పలు వీధుల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆ శాఖ ఈఈ కె.గోపాలరావునాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని 11కేవీ ఫీడర్ పరిధిలోగల చెట్లు తొలగింపు కారణంగా ఇందిరా కాలనీ, రామాపురం కాలనీ, గాంధీ సత్రం, దేవీనగర్, పార్వతీనగర్, చినకుమ్మరి వీధి, రెడ్డి వీధి, టౌన్ నాయుడు వీధి, వేమకోటివారి వీధి, పండా వీధి, కుసుమగుడ్డి వీధి, కంచరవీధి, గౌడు వీధి, భేరి వీధి, కోసూరు వారి వీధి, పిల్లా వీధి, హరిజన వీధులతో పాటు కృష్ణపల్లి గ్రామంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు. ● **గరుగుబిల్లి:** అడ్డాపుశీల గ్రామ సమీపంలోని 11కేవీ విద్యుత్ లైన్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు నేపథ్యంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నారు. ఉల్లిభద్ర, కేఆర్ఎన్ వలస, కొంకడివరం, సీతారాంపురం, తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాను నిలుపుదల చేయనున్నారు.

నిరాశ్రయుల వసతి గృహానికి వితరణ


నిత్యావసర సరుకులు అందజేస్తున్న అనూష

బెలగాం: పార్వతీపురం పట్టణంలోని రైతు బజార్ వద్ద ఉన్న నిరాశ్రయుల వసతి గృహానికి ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర సతీమణి అనూష నిత్యవసర సరుకులు, కూరగాయలు శుక్రవారం వితరణ చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరాశ్రయులకు ప్రతిఒక్కరూ అండగా ఉండాలని పిలుపునిచ్చారు.